క్లుప్తంగా

ఘనంగా గణపతి హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని ధర్మ శాస్తా దేవాలయంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం గణపతి హోమాన్ని ఘనంగా చేశారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిగాయి. ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వర రావు, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు పూజలు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషి మాత అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి అష్టోత్తర శత నామాలతో పూజలు చేశారు. లలితా సహస్రనామార్చనలు, ఉద్యాపనులు, మహా నివేదన, మహా హారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

ఆరోగ్యంపై అవగాహన



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

లావేరు: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పెదలింగాలవలస వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత అన్నారు. ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యంపై బుధవారం అవగాహన కల్పించారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. పరిశుభ్రత పాటిస్తూ మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తెలియజేస్తే ఉచితంగా వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మెరుగైన ఆరోగ్యం



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ వైద్యంతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని డాక్టర్ లావేటి రమ్యప్రియ అన్నారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో మానసిక దివ్యాంగులకు ఫిజియోథెరపీ వైద్యాన్ని బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫిజియోథెరపీ చేస్తే ఉల్లాసంగా ఉంటారన్నారు. రాజీవ్ విద్యామిషన్ ద్వారా ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఎంఈవో అరసాడ రవి, ఐఈడీ ఉపాధ్యాయుడు కృష్ణ ఉన్నారు.

కార్గిల్ వీరులకు ఘన నివాళి



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో కార్గిల్ విజయ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా యుద్ధంలో అమరులైన సైనికులకు విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. యుద్ధం వివరాలను డైరెక్టర్ ముద్దాడ సత్య ప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ తరిణి అర్జున చక్రవర్తి, పీఈటీ లక్ష్మణ్‌నాయుడు పాల్గొన్నారు.

తాడివలసలో ఓటర్ జాబితా సర్వే



సర్వే చేస్తున్న బీఎల్‌ఓ

పొందూరు: మండలంలోని తాడివలస గ్రామంలో ఇంటింటా ఓటర్ జాబితా సర్వే బుధవారం ప్రారంభమైంది. వాస్తవానికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి సర్వే తప్పనిసరిగా ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ.. సాంకేతిక కారణాలతో ఐదు రోజులు బీఎల్‌ఓలు సర్వే నిర్వహించలేదు. తహసీల్దార్ పి.వేణుగోపాలరావుకు ఈ విషయం తెలియడంతో సమస్యను పరిష్కరించి సర్వే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు.

కుండపోత..



ఎచ్చెర్లలో జలమయమైన పొలాలు, రోడ్డు



లావేరు: కేశవరాయునిపురంలో కురుస్తున్న వర్షం



నీట మునిగిన 2వ డిపో గ్యారేజీ



నీటు మునిగిన కాంప్లెక్స్

లావేరు/ఎచ్చెర్ల క్యాంపస్: లావేరు, ఎచ్చెర్ల మండలాల్లో బుధవారం కుండపోతగా వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జాతీయ రహదారిపై ఎచ్చెర్ల, చిలకపాలెం, నవభారత్ జంక్షన్ ప్రాంతాల్లో ఫ్లైఓవర్ వంతెల కింద భారీగా వరదనీరు నిలిచి పోయింది. మరో పక్క నారాయణపురం కుడి కాలువ కింద శివారు భూములకు సాగునీరు చేరింది. ఈ వర్షం మొక్కజొన్న, చెరుకు, బొప్పాయి, కొబ్బరి, కూరగాయాలు, అరటి పంటలకు మేలు చేకూర్చుతోందని రైతులు అంటున్నారు.

కాంప్లెక్స్ జలమయం

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ భారీగా కురుస్తున్న వర్షాలకు జలమయమైంది. మంగళ, బుధవారాల్లో కురిసిన వర్షాలకు కాంప్లెక్స్‌తో పాటు 1, 2 డిపోల గ్యారేజీలు, కాంప్లెక్స్ ఆవరణ, నాన్‌స్టాప్ పోర్టికో నీటమునిగాయి. దీంతో బస్సుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కాంప్లెక్స్ జలమయం కావడంతో ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు నానా అవస్థలు పడ్డారు.

ప్రజా సేవకుడు సీఎం జగన్



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రజలకు నిరంతరం సేవలు చేయాలనే తాపత్రయంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. గత ప్రభుత్వాల్లో పాలకులు తమ జేబులు నింపుకునేందుకు రాజకీయాలు చేసేవారన్నారు. ఇప్పుడు అందుకు భిన్నంగా సీఎం జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ఖాజీపేట, ఆదిత్యనగర్‌కాలనీ, పాత్రునివలస గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సేవలను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏవిధంగా చేరువ చేస్తుందో వివరించారు. రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో మార్పులు వంటి సేవలను ఈ కార్యక్రమం ద్వారా అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్, వైఎస్సార్‌సీపీ నాయుకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు



ఎర్రవరంలో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న సాయికుమార్

రణస్థలం: అర్హులందరికీ సచివాలయాల ద్వారా సత్వరమే మెరుగైన సేవలందుతున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. ఎర్రవరం, రణస్థలం–1 గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందిన ఫిర్యాదులను శతశాతం పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తలపెట్టారన్నారు. అర్హులైన లబ్ధిదారులకు 11 సేవలను ఉచితంగానే క్షణాల్లో అందిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బి.దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఎంపీడీవో ఆర్.వి. రమణమూర్తి, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, రాయిపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, గ్రామ నాయకులు పిన్నింటి లక్ష్మంనాయుడు, మహంతి జోగినాయుడు, మహంతి గురునాయుడు, పసుపురెడ్డి సురేష్, గొర్లె కోటి, కెల్ల కోటి, లంక సీతంనాయుడు, బోనెల అప్పయ్యమ్మ, బోనెల చిన్న ఉన్నారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి



బొమ్మలను పరిశీలిస్తున్న దృశ్యం

జి.సిగడాం: విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయుడు కూడా నిత్య విద్యార్థేనని ఎంఈవో అరసాడ రవి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్‌లో భాగంగా ఉపాధ్యాయలకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి అర్థమయ్యేలా పాఠాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులు తయారు చేసిన వివిధ సామగ్రిని ప్రదర్శించాలన్నారు. అద్వానంపేట ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి తయారు చేసిన బొమ్మలు, రికార్డులను తోటి ఉపాధ్యాయుల కోసం ప్రదర్శించగా.. వీటిని విద్యాశాఖ సిబ్బంది పరిశీలించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



జ్వరాలపై ఆరా తీస్తున్న హెల్త్ సిబ్బంది

బూర్జ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓ కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్ వైజర్లు లఖినాన సరోజిని, తేజారావు అన్నారు. మండలంలోని మదనాపురం గ్రామంలో బుధవారం బూర్జ పీహెచ్‌సీ వైద్యులు ఐ.పావని, జి.రాజశేఖర్ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వేలో భాగంగా జ్వరబాధితులను గుర్తించారు. డెంగీ ఫీవర్‌తో బాధపడుతున్న వావిలపల్లి పాపమ్మ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఆమెకు పలు సూచనలు అందజేశారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ ప్రజలు అధైర్యపడాల్సిన పనిలేదని, ముందస్తు జాగ్రత్తలు చర్యలు పాటిస్తే అంటురోగాలు దరిచేరవన్నారు. గ్రామంలోని బావుల్లో, మురుగు నీరు నిల్వ ఉన్నచోట క్లోరినేషన్ చేయించారు. ఎంఎల్‌హెచ్‌పి పి.శ్రావ్య, హెల్త్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపరిహారం పెంచాలి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పొందూరు: మడ్డువలస కాలువ తవ్వకాల్లో కోల్పోయిన తమ భూములకు నష్టపరిహారాన్ని త్వరగా అందించాలని కొందరు రైతులు, పెంచాలని మరికొందరు రైతులు అధికారులను కోరారు. నర్సాపురం గ్రామంలో రెవెన్యూ, మడ్డువలస, భూసేకరణ అధికారులు నర్సాపురం, వీఆర్‌గూడెం, వావిలపల్లిపేట రైతులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. తమకు ఇచ్చిన నష్టపరిహారం చాలా తక్కువని, పరిహారాన్ని పెంచాలని నర్సాపురం రైతులు కోరారు. నష్టపరిహారాన్ని ఒకసారి అందించిన తర్వాత మరలా పెంచడం సాధ్యం కాదని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, మడ్డువలస డీఈ నాగేశ్వరరావు చెప్పారు. వీఆర్‌గూడెంలో 15 మంది రైతులకు, వావిలపల్లిపేట గ్రామంలో ఐదుగురు రైతులకు పరిహారం అందించిన తర్వాతే పనులు ప్రారంభించాలని రైతులు స్పష్టం చేశారు. దీంతో సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది.

ప్రతి ఇంట్లో ధ్యానం చేయాలి

శ్రీకాకుళం కల్చరల్: ఇండియా మెడిటేట్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంట్లో ధ్యానం చేయాలని రవిశంకర్ గురూజీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి కె.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా కేంద్ర సాంస్కృతిక శాఖ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే 15 లక్షల మంది ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్నారన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

ఎచ్చెర్ల క్యాంపస్: ఓటర్ల జాబితాలను పారదర్శకంగా సిద్ధం చేస్తున్నట్లు ఎచ్చెర్ల తహసీల్దార్ వై.సత్యనారాయణ బుధవారం తెలిపారు. ప్రతిఇంటికీ వెళ్లి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలతో గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు స్వీకరిస్తున్నామన్నారు. ఎచ్చెర్ల మండలంలో 72,346 మంది ఓటర్లు ప్రస్తుతం ఉన్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 21 వరకు ఇంటింట సర్వే కొనసాగుతోందన్నారు. బూత్ లెవల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది సర్వేలో పాల్గొంటున్నారన్నారు. అర్హతగల ప్రతి ఒక్కరి పేర్లు జాబితాలో ఉంటాయన్నారు. అభ్యంతరాలపై విచారణ చేస్తామన్నారు. బొంతలకోడూరులో జగనన్న శాశ్వత భూహక్కు సర్వే జరుగుతుందని వివరించారు.

కొలతల ప్రాప్తికి పనులు చేయాలి

ఎచ్చెర్ల: వేతనదారులు కొలతల ప్రాప్తికి పనులు చేపట్టాలని ఉపాధి హామీ పథకం ఏపీవో శోభాదేవి తెలిపారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో సంబంధిత సిబ్బందితో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిబంధనల మేరకు పని చేస్తేనే వేతనం గిట్టుబాటవు అవుతుందనే విషయమై వేతనదారులకు అవగాహన కల్పించాలన్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

31లోగా దరఖాస్తు చేసుకోవాలి

కొత్తూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో గల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో పారాలీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జడ్జి ఎస్.మణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయశాస్త్రం చదివిన విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అర్హులన్నారు. నియామకం చేసిన వలంటీర్లకు ఎటువంటి పారితోషకం ఉండదన్నారు. గుర్తింపు కార్డు ఇస్తామన్నారు.

ఇంటర్ విద్య కీలకం



మాట్లాడుతున్న ఎంఈఓ రామచంద్రరావు

ఆమదాలవలస: ప్రతీ విద్యార్థికి జీవితంలో ఇంటర్‌మీడియెట్ కీలకమని ఆమదాలవలస ఎంఈఓ జి.రామచంద్రరావు అన్నారు. స్థానిక ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో టీఎస్ఆర్ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ భవిష్యత్‌లో మంచి మార్గాన్ని ఎన్నుకోవడానికి ఇంటర్ విద్య కీలకమన్నారు. విద్యార్థులు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టీఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.వి.కాంతారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చక్రధరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలవాలి

- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జనార్దనరెడ్డి



సమావేశంలో పాల్గొన్న జనార్దనరెడ్డి తదితరులు

లావేరు: ఇంటింటా సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ప్రజలు మళ్లీ అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఎచ్చెర్ల మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దనరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు అన్నారు. పెదలింగాలవలస గ్రామంలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఏ నాయకుడు కూడా సీఎం జగన్ వలే సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న తప్పుడు ఆరోపణలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. 2014లో జరగనున్న ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నిక కావడం ఖాయమన్నారు. ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతోందని.. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ డైరక్టరు లుకలాపు అప్పలనాయుడు, ధర్మవరం సర్పంచ్ అల్లు కన్నబాబు, కొత్తకోట, గోవిందపురం పంచాయతీల మాజీ సర్పంచ్‌లు శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, లావేరు హైస్కూల్ పీఎంసీ చైర్మన్ లంకలపల్లి మల్లేశ్వరరావు, పార్టీ నాయకుడు పతివాడ గురునాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



ప్రకాశరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

జి.సిగడాం: నిద్దాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, జి.సిగడాం సహకార సంఘం చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు కోడలు ప్రశాంతి ఇటీవల చెందారు. దీంతో ప్రకాశరావు కుటుంబాన్ని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జి.సిగడాం మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు కాయల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, డీసీఎంఎస్ డైరెక్టర్ నక్క ప్రసాదరావు బుధవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. సర్పంచులు చిత్తిరి మోహన్, తొత్తడి రామారావు, పున్నాన అక్కలనాయుడు, గేదెల నారాయణరావు, మీసాల సీతారాం, డకర కృష్ణ, నక్క శశిభూషణనాయుడు, అరుణోదయ విద్యాసంస్థల డైరెక్టర్ గర్లంకి శ్రీనివాసరావు, పొందూరు మండల పార్టీ నాయకులు కోరుకొండ సాయికుమార్ ఉన్నారు.

బిస్కెట్ల తయారీపై ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న గీతాశ్రీకాంత్

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి కూడలిలోని హాయ్ బేకరీలో చిరుధాన్యాలతో కేకులు, బిస్కెట్ల తయారీపై మహిళలకు ఈ నెల 28, 29 తేదీల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు రోటరీ క్లబ్ శ్రీకాకుళం అధ్యక్షురాలు, కోవె ఇండియా ఉత్తరాంధ్ర సెక్రటరీ డాక్టర్ యార్లగడ్డ గీతాశ్రీకాంత్ తెలిపారు. బేకరీలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. శిక్షకుడు, హాయ్‌బేకరీ యజమాని రాము ఈ రెండు రోజుల్లో 12 రకాల పౌష్టిక ఆహార పదార్థాల తయారీపై శిక్షణ ఇస్తారన్నారు. కోవె ఇండియా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు రాధికా, నేషనల్ సెక్రటరీ అపర్ణ శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షిస్తారన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు 27వ తేదీ సాయంత్రంలోగా పేర్లు నమోదు చేసుకోవాలని గీతాశ్రీకాంత్ సూచించారు. మరిన్ని వివరాలకు 94901 62799, 97042 55528 నంబర్లను సంప్రదించాలి. కార్యక్రమంలో మెప్మా మహిళా సమాఖ్య నాయకురాలు సుగుణ, బేకరీ యజమాని రాము ఉన్నారు.

• జోరందుకున్న ఉభాలు



ట్రాక్టర్‌తో దమ్ము పడుతున్న రైతులు

శ్రీకాకుళం రూరల్: విస్తారంగా వర్షాలు పడుతుండంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మండల పరిధిలోని సానివాడ గ్రామ పరిసర పొలాల్లో జోరుగా ఉభాలు చేపడుతున్నారు. శ్రీకాకుళం మండల పరిధిలో 4,390 హెక్టార్లలో వరిసాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారి ఉషాకుమారి తెలిపారు.

శివారు ఆయకట్టుకు సాగునీరు

- ఓని గెడ్డ రిజర్వాయర్ కాలువ ఆధునికీకరణ పనులు ప్రారంభం



వెలగవాడ వద్ద ఓనిగెడ్డ రిజర్వాయర్ కాలువ పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బూర్జ: మండలంలో శివారు ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు, టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు అన్నారు. ఓని గెడ్డ రిజర్వాయర్ కాలువ ఆధునికీకరణ పనులు బుధవారం మన్యం జిల్లా పాలకొండ మండలం వెలగవాడ వద్ద (రిజ్వాయర్ హెడ్ నుంచి) ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని, ప్రస్తుత ఖరీఫ సీజన్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఓని గెడ్డ రిజర్వాయర్ పనులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారని, దీనికి స్పీకర్ తమ్మినేని సీతారాం కృషి ఎంతో ఉందన్నారు. రైతులకు అండగా ఈ ప్రభుత్వం ఉంటుందన్నారు. ఉభయ జిల్లాల కలెక్టర్ల ఆమోదంతో పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. పూడికలు తొలగించి, కాలువల ఆధునీకరణ పనులు త్వరగా పూర్తిచేయడం జరుగుతుందన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్, మండల సచివాలయ కమిటీ కన్వీనర్ల కోఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పార్టీ నాయకులు వి.కృష్ణ, రైతులు పాల్గొన్నారు.